క్లుప్తంగా

రెండు ట్రాక్టర్లు సీజ్



న్యాల్‌కల్(జహీరాబాద్): అక్రమంగా ఎర్ర రాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. శనివారం గణేష్‌పూర్ గ్రామశివారు నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఎర్రరాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఎర్రరాయి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్యాన్‌లు,ట్యూబ్‌లైట్ల ధ్వంసం



తరగతి గదిలో విరిచేసిన ఫ్యాన్ రెక్కలు

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదిలోని ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పాఠశాల సిబ్బంది కథనం ప్రకారం.. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మొగుడంపల్లి ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులను నిర్మించారు. ఓ తరగతి గదిలో ఫ్యాన్స్,టూబ్‌లైట్లను బిగించారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించి తరగతి గదిలోని ఫ్యాన్స్ రెక్కలను విరిచేశారు.. ట్యూబ్‌లైట్లను పగులగొట్టి కిటికి ఉన్న ఇనుప చువ్వలను ధ్వంసం చేశారు. శనివారం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు గమనించి చిరాగ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పరీక్ష సామగ్రిని అందజేస్తున్న దాతలు

నారాయణఖేడ్: పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో దాతలు పరీక్ష ప్యాడ్లు, ఇతర విద్యాసమగ్రిని శనివారం పంపిణీ చేశారు. మనూరు మండలం ఎల్గోయి జిల్లా పరిషత్తు పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు శివశక్తి జిల్లా కార్యదర్శి శివాజీ, ఏబీవీపీ బాధ్యులు దత్తురెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, అఖిల్, శంకర్, విజయ్‌లు పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రితోపాటు భగవద్గీత పుస్తకాలను సైతం పంపిణీ చేశారు. ఖేడ్ జిల్లా పరిషత్తు పాఠశాలలో 148 మంది విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది విశ్వనాథ స్వామి, నిజాంపేట్ ఉన్నత పాఠశాలలో 98మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ జిల్లా కార్యదర్శి శ్రీధర్ ఆస్పల్లి పరీక్ష ప్యాడ్లు, జామెట్రి బాక్సులు అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జోగినాథ రథోత్సవాలకు శ్రీకారం



రథాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు

జోగిపేట(అందోల్): జోగినాథ రథోత్సవాల్లో భాగంగా శనివారం జోగిపేటలోని జోగినాథ ఆలయం వద్ద రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 2 నుంచి 12వ వరకు రథోత్సవాలు జరగనున్నాయి. 50 అడుగుల లోహ రథం వద్ద కమిటీ అధ్యక్షుడు డి.శివశంకర్‌తో ఆలయ పూజారులు భద్రప్ప ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని ఆలయం నుంచి గొని చౌరస్తా వరకు ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు శివశేఖర్, సురేందర్‌గౌడ్, రంగ సురేష్, ప్రేమ్‌కుమార్, నాగభూషణం, ప్రేమ్‌కుమార్, అంటి రాములు పాల్గొన్నారు.

త్వరగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాల్గావ రోజుకు చేరాయి. సీఎం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. దీక్షలో ఆయా సంఘాల నాయకులు అబ్రహం మాదిగ, జైరాజ్, ఉల్లాస్ మాదిగ, నవీన్‌కుమార్, రత్నం పాల్గొన్నారు.

పంటపొలాల్లో ఇటుక బట్టీలు

- ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లోనూ ఇష్టానుసారంగా ఏర్పాటు
- సుమారు 200 ఎకరాల్లో మినీ పరిశ్రమలను తలపిస్తున్న బట్టీలు
- ఎన్‌ఏ బదలాయింపులు లేకుండానే బట్టీల నిర్వహణ
- బట్టీల్లో పనిచేస్తోన్న వందలాది కూలీలు
- కనీస వసతులు లేక అవస్థలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



శేఖాపూర్ శివారులో పచ్చని పంట పొలాల మధ్య వెలసిన ఇటుక బట్టీలు

జహీరాబాద్: జహీరాబాద్‌లో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి ఏకంగా మినీ పరిశ్రమను తలపిస్తున్నాయి. ఈ ఇటుక బట్టీలు పచ్చని పంట పొలాలను కూడా మింగేస్తున్నాయి. దీంతో ఎంతో సారవంతమైన భూములు నిస్సారంగా మారిపోతున్నాయి. వ్యవసాయేతర భూములుగా మార్చకుండానే ఇష్టారీతిగా ఇటుక బట్టీలు ఏర్పా టు చేసుకుని వ్యాపారులు లబ్ధి పొందుతున్నారు. ప్రైవేటు భూములనే కాకుండా అసైన్డ్ భూముల్లో సైతం ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ ఇటుకబట్టీల విషయంలో చూసీచూడనట్లుగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

10 నుంచి 20 ఎకరాల్లో...

ఒక్కో ఇటుక బట్టీ 10 ఎకరాలు మొదలుకుని 20 ఎకరాల విస్తీర్ణంలో వెలిశాయి. జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 200 ఎకరాల్లో ఇటుక బట్టీలు వెలిసినట్లు అంచనా. ఒక్కో ఇటుక బట్టీలో 20 నుంచి 40 మంది వరకు కూలీలు పనిచేస్తున్నా వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా ఉదయం నుంచి రాత్రి వరకు పనులు చేయించుకుంటున్నారు. బట్టీల్లో పనిచేసే కార్మికులకు తమ చిన్నారులతో కలసి అక్కడే నివాసం ఉండేందుకు తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసినా కనీస సదుపాయాలు కూడ లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. హోతి(కె), చిన్న హైదరాబాద్, హోతి(బి), అర్జున్ నాయక్ తండా, కొత్తూర్(బి), శేఖాపూర్, శేఖాపూర్ తండా, జహీరాబాద్ తదితర గ్రామాల్లో ఇటుక బట్టీలను ఏర్పాటు చేశారు. ఇటుకలను కాల్చేందుకు బట్టీలు ఏర్పాటు చేసి మంటలు వేస్తుండటంతో సారవంతమైన భూములు నిస్సారంగా మారి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. పరిసర ప్రాంతాల్లో సాగులో ఉన్న పంటలు బట్టీల నుంచి వెలువడే పొగకు పాడవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

ఇటుకలు తయారు చేసేందుకు అవసరమైన మట్టిని వ్యాపారులు అక్రమంగా తరలించుకుపోతున్నారు. రాత్రిపూట జేసీబీలు, టిప్పర్ల సహాయంతో అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తున్నారు. సరిహద్దులో ఉన్న కర్ణాటక పరిధిలోని అసైన్డ్ భూము లు, చెరువులు, కుంటలను కూడా ఇటుకబట్టీల వ్యాపారులు వదలడం లేదు. అయినా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

లాభసాటి వ్యాపారం కావడంతో...

భవన నిర్మాణ రంగం ఊపందుకుంటుండటంతో ఇటుక వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు చందంగా సాగుతోంది. ఇటుకలకు భారీ డిమాండ్ ఉండటంతో బట్టీల్లో లక్షలాది ఇటుకలను తయారు చేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. జీరో వ్యాపారం చేస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు.

టన్నుల కొద్దీ అక్రమ కలప వినియోగం

ఇటుకలను కాల్చేందుకు అవసరమైన కలపను వ్యాపారులు అక్రమంగా తరలించుకుపోతున్నారనే ఆరోపణలున్నాయి. నిత్యం టన్నుల కొద్దీ కలప ఇటుక బట్టీలకు అక్రమంగా తరలివస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

> **తన దృష్టికి రాలేదు**
>
> వ్యవసాయ భూముల్లో ఇటుకబట్టీలు ఏర్పాటు చేసిన విషయం తన దృష్టికి రాలేదు. వీటి విషయంలో తగిన విచారణ చేపడతాం. బట్టీలకు ఎన్‌ఏ ఉన్నదీ లేనిది పరిశీలించి, అక్రమంగా బట్టీలను ఏర్పాటు చేసుకున్నట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.
>
> –రవీందర్, తహసీల్దార్,జహీరాబాద్

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన



జహీరాబాద్: నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు నిరసనగా శనివారం పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. పలువురు నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అసత్యలపై మాట్లాడితే సస్పెన్షన్ చేయడం శోచనీయమన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ, నాయకులు నామరవికిరణ్, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, భాస్కర్, యాకూబ్, రాకేష్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో బీఆర్‌ఎస్ నిరసన

నారాయణఖేడ్: ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని వెంకట్‌రెడ్డి చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నినదించారు. ఖేడ్ మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, ఖేడ్ పట్టణ, మనూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేష్, విఠల్‌రావు, మాజీ కౌన్సిలర్ విఠల్, వెంకటేశం, సిద్ధు పాల్గొన్నారు.

19న ఆలయ భూముల వేలం

నారాయణఖేడ్: పట్టణంలోని రామమందిరానికి సంబంధించిన భూములను 2025 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు కౌలు చేసుకునేందుకు ఈనెల 19న వేలం వేయనున్నట్లు ఈఓ శివరుద్రప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.11 గంటలకు రామమందిరంలో వేలం ఉంటుందన్నారు. సర్వే నం.87లోని 27.16ఎకరాలు, సర్వే నం .106లోని 5.23 ఎకరాలు, 23 సర్వేనం.7.21 ఎకరాలు, 90 సర్వే నం.1.09 ఎకరాలను కౌలు కోసం వేలం వేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు నిబంధనల ప్రకారం డిపాజిట్‌ను చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు 8096834957 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వినియోగదారుల్లో చైతన్యం పెరగాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌ఎస్ రత్న ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ.. వినియోగదారులు చైతన్యవంతంగా ఉన్నప్పుడే ఉత్పత్తిదారులు, అమ్మకందారుల మోసాల బారిన పడకుండా ఉంటారన్నారు. మనం కొనే వస్తువు నాణ్యమైనదా కాదా అని సరిచూసుకోవాలన్నారు. కొన్ని వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఒక వేళ అది నాణ్యమైనది కాకపోతే ఆ బిల్లు ద్వారా మనం వినియోగదారుల సహాయ కేంద్రాలను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తారా కళాశాల అధ్యాపకులు రవీందర్, వీరేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఏఓ పరమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సాంఘిక సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ పరమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గత తొమ్మిది నెలలుగా జీతాలులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 86 మంది కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ పద్ధతిలో గత 10 సంవత్సరాలుగా వాచ్‌మెన్, కామెటిలు, వంట మనుషులుగా పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ కూడా అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో పొలంబాట కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్ క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు సరఫరాకు సంబంధించి ఎలాంటి లోపాలున్నా వెంటనే సిబ్బంది లేదా అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. రైతులకు స్నేహపూర్వక సేవలు అందించడంలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఒక్కఫోన్ కాల్‌తో లైన్‌మేన్‌లు అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్ రైతులు ఆంజనేయులు, శ్రీనివాస్, సాయిరెడ్డి, పాపయ్య, అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ దుకాణంలో చోరీ



షట్టర్ తాళాలు ధ్వంసం చేసిన దుండగులు

జహీరాబాద్: పట్టణంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీలోని ఎలక్ట్రిక్ దుకాణంలో దొంగలు పడ్డారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. కౌంటర్‌లోని నగదు, ఎలక్ట్రిక్ సామగ్రిని దొంగిలించి ద్విచక్ర వాహనంపై పారిపోయారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని (బొంతపల్లి) వీరన్నగూడెంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈఓ శశిధర్ గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో శివకేశవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు లెక్కింపు చేపట్టారు. 91 రోజులకు సంబంధించి 13 లక్షల 83 వేల 135 రూపాయలు హుండీ ఆదాయంగా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అన్నదానం హుండీకి సంబంధించి 57 వేల 447 రూపాయలు సమకూరిందన్నారు. ఈ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు గ్రామ పెద్దలు శివకేశవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

17న ఆలయ వార్షికోత్సవాలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో పంచముఖ హనుమాన్ మందిరం వార్షికోత్స ఉత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వార్షికోత్సవ ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం 108 కళశాలతోమహిళల ఊరేగింపు, ధ్వజారోహణం, గోపూజ, విఘ్నేశ్వరపూజ, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మున్సిపల్ అధికారులకు నోటీసులు

సంగారెడ్డి జోన్: జిల్లాలోని మున్సిపాలిటీలకు సంబంధించిన ఇంటి పన్నులు, ఆస్తిపన్ను, కుళాయి బిల్లుల వసూల్లో నిర్లక్ష్యం వహించిన సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్లు, బిల్ కలెక్టర్లకు జిల్లా కలెక్టర్ క్రాంతి శనివారం షోకాజ్ నోటీసులను జారీ చేశారు. మార్చి చివరినాటికి 100% పన్నులు వసూలు చేయాలని టార్గెట్ ఉన్నా వసూళ్లపై నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం కొంత మంది మున్సిపల్ బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మేనేజర్లను సస్పెన్షన్, షోకా జ్ నోటీసులు జారీ చేసినప్పటికీ సిబ్బంది పనితీరులో మార్పు రాలేదు. దీంతో జహీరాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, మేనేజర్ ఉమేశ్వర్‌లాల్, బిల్ కలెక్టర్లు 8 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ఛావన్, మేనేజర్ సూర్యప్రకాష్ , బిల్‌కలెక్టర్లు 27 మందికి నోటీసులు జారీ చేశారు. సదాశివపేట మున్సిపాలిటీలో కమిషనర్ జె.ఉమా, మేనేజర్ ఉమర్ సింగ్, 14 మంది బిల్ కలెక్టర్లకు నోటీసులు జార్ చేశారు. నోటీసులకు 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు.

ఏఐ విధానంతో అభ్యాసన మెరుగు

ఎంఈఓ మారుతి రాథోడ్



ఏఐ బోధనపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకే ఏఐ బోధనా విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. మండలంలోని హద్నూర్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఆధారిత బోధనను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఏఐ విధానంలో ఎలా బోధనా చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు. దశలవారీగా అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అసెంబ్లీ తీర్మానం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ప్రసాద్



ఎమ్మార్పీఎస్ నాయకుల రిలే నిరాహార దీక్ష

హత్నూర (సంగారెడ్డి): ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి గందగల ప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం హత్నూర రెవెన్యూ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ చట్టబద్ధత తో పాటు గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల నియామకాల భర్తీ చేయాలని డిమాండ్ చూస్తూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతకు తీర్మానం చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ రిలే దీక్షల్లో నాయకులు మొగులయ్య బుచ్చంద్ర, రాజు, ఎల్లేష్, మల్లేష్ ,అనిల్, సురేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

ఝరాసంగం(జహీరాబాద్): మహిళా సంఘాల సభ్యులు సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పేదరిక నిర్మూలన సంస్థ సహాయక ప్రాజెక్టు మేనేజర్ టిక్యానాయక్ అన్నారు. శనివారం ఝరాసంగంలోని పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో వీవోఏలు, వీఓబిలకు మహిళల అక్రమ రవాణాపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, చిన్నపిల్లల అక్రమ రవాణాను అరికట్టడంలో గ్రామ సంఘాల బాధ్యత ఎంతో ఉందన్నారు. నేటి ఆధునికయుగంలో ప్రతి ఒక్కరి దగ్గర ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండడం సాధారణమైందన్నారు. వీటి ద్వారా అనేక సైబర్‌నేరాలు మనకు తెలియకుండానే జరుగుతున్నాయన్నారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చిన బెనిఫిట్ మెసేజీలు వచ్చిన రెస్పాండ్ కావద్దన్నారు. మాజీ ఐఏఎస్ అధికారిని సునీత కృష్ణన్ ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి అక్రమ రవాణాకు గురైన మహిళలను చిన్నపిల్లలను గుర్తించి, వివిధ ఏజెన్సీల ద్వారా వారిని కలుసుకొని తన సంస్థలో చేర్చుకొని వారి యోగక్షేమాలు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ సంగమేశ్వర్, టీఓటీ మారుతి, సీసీలు మల్లేశం, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సమ్మ, మహిళా సంఘాల సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



సామగ్రి అందజేస్తున్న సురేందర్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యువజన వికాసమితి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైంది అన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్‌గౌడ్, సభ్యులు సత్యనారాయణ, షణ్ముఖ ఉపాధ్యాయుల కృష్ణ గౌడ్, సత్యనారాయణ, రాజేష్ స్థానిక నాయకులు ఆంజనేయులు నర్సింలు భాస్కర్ సతీష్ మహేష్ సాయికుమార్ నితిన్‌కుమార్ స్వామి పాల్గొన్నారు.

వెయ్యి డప్పులతో దిగ్బంధం చేస్తాం



నారాయణఖేడ్: మాట్లాడుతున్న అలిగే జీవన్‌కుమార్

నారాయణఖేడ్: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగలకు ఇవ్వని పక్షంలో ఖేడ్‌ను వెయ్యిడప్పులతో దిగ్బంధం చేస్తామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ జీవన్ కుమార్ హెచ్చరించారు. ఎస్సీల వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాల ఫలితాలు వెల్లడించొద్దన్నారు. ఖేడ్ తహసీల్ మైదానంలో చేపట్టిన నిరసన దీక్ష శనివారంతో ఐదవ రోజుకు చేరింది. మాదిగలను విస్మరించే పార్టీలు మనుగడ సాధించలేవన్నారు. సంఘం నాగల్‌గిద్ద మండల అధ్యక్షుడు ప్రకాష్, మనూరు మండల ఉపాధ్యక్షుడు కిష్టయ్య, దివ్యాంగుల పోరాట సమితి డివిజన్ అధ్యక్షుడు పీరయ్య, మాజీ ఎంపీటీసీ రాములు, రాజు, నవీన్ దీక్షలు పాల్గొన్నారు.

చెల్లిని పరీక్ష రాయించేందుకు తీసుకెళ్తూ..

యువకుడి మృతి



ప్రదీప్ మృతదేహం

జహీరాబాద్: చెల్లిని ఇంటర్ పరీక్ష రాయించేందుకు బైక్‌పై తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. రూరల్ ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. కర్ణాటకలోని బస్వకల్యాణ్‌కు చెందిన ప్రదీప్ చెల్లెలు ఆశ, తల్లి సునీతతో కలిసి హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షను రాయించేందుకు చెల్లెలు ఆశను బైక్‌పై వెళ్తున్న క్రమంలో మండలంలోని హుగ్గెల్లి గ్రామం వద్ద లారీ ఓవర్‌టేక్ చేస్తూ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ప్రదీప్‌తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ఆశ స్వల్పగాయాలతో బయటపడింది. ఆమెను చికిత్స నిమిత్తం బీదర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ప్రసాద్ రావు పేర్కొన్నారు.